## శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ ఉన్నత పాఠశాల చేకూరపాడులో నా మధుర జ్ఞాపకాలు

**సింగమనేని నాగేశ్వరరావు 1988 SSC బ్యాచ్**

అప్పుడే ఐదవ తరగతిని వలేటివారిపాలెంలో పూర్తిచేసుకుని అమాయకమైన ముఖాలతో, తొలిసారి నా భవిష్యత్తుకు పునాది రాయి వేసుకుంటున్నాను అని ఆలోచించలేని వయస్సులో జూన్ 12 ,1983న ఉదయం 8:50 గం.లకు చేకూరపాడులోని శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తొలి అడుగు పెట్టినాను. చుట్టూ చెట్లు, పచ్చని పచ్చిక, మధ్యలో L ఆకృతి బిల్డింగ్, వెనుక ఉన్న చిన్న రేకుల షెడ్డు క్లాసులు ఇలా ఒక కొత్త లోకంలోకి అడుగుపెట్టినట్లుంది.... అంతే ఒక వారంలోనే అంతా పరిచయాలు. క్లాసులో ఒక్కొక్కరు ఒక్కొక్క శాస్త్రవేత్తలా మాట్లాడేవారు. మొదటి వారంలోనే హెడ్ మాస్టర్ శ్రీ గురవయ్య గారు తరగతి గదిలోకి వచ్చి పాఠశాల నియమ నిబంధనలు చెప్పి పాటించకపోతే తోలు ఒలిచేస్తా రాస్కెల్స్ అని చెప్పిన మాటలు ఆ హావభావాలు తలచుకుంటే ఇప్పటికీ అవి చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నట్లే ఉంటాయి. నిజంగా మన పాఠశాల మేధావులను తయారుచేసిన ఒక సామాజిక దేవాలయం. అక్కడ పనిచేసిన ప్రతి ఉపాధ్యాయుడు ఎంతో ఏకాగ్రతతో ముడి రాయిని అందమైన శిల్పాలుగా మలిచే అద్భుతమైన శిల్పులుగా కనిపించేవారు. ప్రతి ఉపాధ్యాయుడు మిగిలిన ఉపాధ్యాయుల కంటే నేనే మెరుగ్గా బోధించాలి అని తపన పడేవారు. అందువల్లనేమో ఏ పాఠశాలకు సాధ్యం కానీ అనేక ఉన్నత పదవులను , ఉన్నత స్థానాలను , ఉన్నత ఉద్యోగాలను, మన పాఠశాల విద్యార్థులు సాధించగలిగారు అంటే అతిశయోక్తి కాదు.

మా బ్యాచ్ లో సుమారు 42 మందిమి ఉండే వారం. ఎలాంటి అరమరికలు లేని స్నేహము మా సొంతం. ఆడ ,మగ అనే తేడా ఉండేదే కాదు. అందరము ఒకరి పట్ల ఒకరము అభిమానంతో, కల్లా కపటం తెలియని ఆత్మీయతతో ఉండేవాళ్ళం. నా స్నేహితుల్లో ముఖ్యులు పూర్ణ ,ఆనంద్, భాను ,శ్రీను, వెంకట్రావు, ప్రతిమ, ఈశ్వరమ్మ ,రమ ..... ఉండేవారు. మధ్యాహ్నం భోజనం తెచ్చుకోకపోతే వీరిలో ఎవరో ఒకరు తమ ఇంటికి తీసుకుపోయి భోజనం పెట్టేవారు. వారి అమ్మానాన్నల ఆప్యాయత కూడా మరువలేనిది.

6,7 తరగతులలో శ్రీ వెంకటేశ్వర్లు మాస్టారు, శ్రీ నరసింహారావు మాస్టారు, శ్రీ సారంగపాణి మాస్టారు ,శ్రీ శ్రీనివాసులు మాస్టారు, హిందీ మాస్టారు శ్రీ వై వెంకటేశ్వర్లు మా భవిష్యత్తుకు చక్కని పునాది వేస్తే పై తరగతుల్లో శ్రీ సూర్య కుమారి మేడం, శ్రీ రామారావు మాస్టారు ఆంగ్ల ప్రపంచాన్ని , లెక్కల ప్రపంచాన్ని చాలా అందంగా పరిచయం చేసి మా భవిష్యత్తును బలంగా తీర్చిదిద్దారు. నేను ఎప్పుడూ తరగతిలో ఫస్ట్ ర్యాంకులో ఉండేవాడిని. నాలుగు సంవత్సరములు CPL గా పదవ తరగతిలో SPL గా విద్యార్థులందరిచే ఎన్నుకోబడి వారి ప్రతినిధిగా పనిచేశాను. నాయకుడి నాయకత్వం మీదనే ఒక సమూహం యొక్క విజయం ఆధారపడి ఉంటుంది. మన పాఠశాల విజయాలన్నీ సమర్ధవంతమైన నాయకుడు ,విద్యార్థుల హృదయాలను గెలుచుకున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీ గురవయ్య గారి వల్లనే అని నా నమ్మకం. వారిని నిజమైన నాయకుడిగా నేను బలంగా నమ్మేవాడిని. వారు ఎప్పుడూ చెబుతుండేవారు ఏమ్మా నాగేశ్వరరావు మన పాఠశాలలో ఏడవ తరగతి topper ఎప్పుడు పదవ తరగతి topper kaledu, నీవు దానిని బ్రేక్ చేయాలి అని. అది నా మైండ్ లో ఎప్పుడు తడుతుండేది. ఎప్పుడు మాస్టర్ లందరూ చాలా చక్కగా ప్రోత్సహిస్తుండేవారు. చివరకు 1988లో ఆ రికార్డును బ్రేక్ చేసిన ఘనత నాకు దక్కినందుకు చాలా గర్వపడ్డాను . పదవ తరగతి పూర్తయిన తర్వాత కూడా మన తల్లిదండ్రులతో మన అభివృద్ధిని గూర్చి చర్చిస్తూ ఉండే ఇలాంటి గురువులు దొరకటం మన పూర్వజన్మ సుకృతం అని నేను భావించే వాడిని.

ప్రతి మాస్టారు మన పాఠశాలకు ఒక వరం అని అనుకునేవాడిని. ఆనాటి డ్రిల్ మాస్టర్ శ్రీ గోపాల్ రావు గారు ఎంతో ఓపికగా 6వ తరగతి నుండే ఆసనములు, ఎక్సర్సైజులు ప్రతి రోజు చేయించేవారు. ఈరోజుకు ఈ వయసులో కూడా ఇంత ఆరోగ్యంగా, చలాకీగా ఉన్నామంటే ఆరోజు వారు చెప్పిన ఫిట్నెస్ పాఠాలే కారణం. అలాగే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో క్రీడాకారులుగా మెడల్స్ సాధించడం కూడా ఆయన వల్లనే సాధ్యమైంది . కబడ్డీలో మన పాఠశాలకు ఒక ప్రత్యేకమైనటువంటి పేరుని సంపాదించడం కూడా ఆయన వల్లనే జరిగింది.వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. కానీ మేము సుధాకర్ రావు మాస్టారు ,సుబ్బారావు మాస్టర్ గారి సారధ్యంలో బ్యాట్మెంటన్ ని బాగా ప్రాక్టీస్ చేసే వాళ్ళము. మా బ్యాడ్మింటన్ టీం లో నేను, బొద్దులూరి సుధాకర్, పాపారాయుడు, రాయపాటి రఘు, సముద్రాల శ్రీనివాసరావు ఉండేవారము. పాపారాయుడు కొట్టే కట్ షాట్స్, సముద్రాల శ్రీను కొట్టే నెట్ షాట్స్, నేను సుధాకర్ కొట్టే పవర్ షాట్స్, రఘు కొట్టే

ఫ్రంట్ షాట్లు ఇవన్నీ కలసి  మూడు సంవత్సరాల పాటు వరుసగా స్కూల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ ని సాధించి కప్పుని పర్మినెంట్గా మన పాఠశాలలో ఉంచడం జరిగింది. అది ఇప్పటికీ కూడా మా మధుర స్మృతిలో ఒకటిగా మిగిలిపోయింది. మా టీంలో మా మధ్య ఫ్రెండ్షిప్ కూడా చాలా చక్కగా కొనసాగేది.

ఎనిమిదో తరగతిలో ఆంగ్ల వ్యాకరణమునకు పునాదివేసింది సుబ్బారావు సార్ అయితే ఆంగ్ల భాషను నల్లేరు మీద బండి నడకలా కొనసాగింప చేసింది మాత్రం శ్రీ సూర్య కుమారి మేడం గారు. సూర్యకుమారి మేడం గారు ENGLISH పాఠం లేదా NS పాఠం మమ్మల్ని మరో లోకంలోకి తీసుకుపోయేది. వారు పాఠం చెబుతుంటే ఎంత ఏకాగ్రత లేని వారు కూడా క్రమంగా కాసేపటికే పాఠంలో లీనమైపోయేవారు. అంత అద్భుతంగా పాఠం చెప్పేవారు. రామారావు మాస్టారు అంటే అందరికీ చాలా భయం ఉండేది సార్ కి ముక్కు మీదే కోపం ఉంటుందని భయపడేవారు. కానీ ఆయన హృదయానికి దగ్గర అయిన వారికే తెలుస్తుంది ఆయన మనస్సు ఎంత మంచిది అనేది. గణితాన్ని అలవోకగా బోధించేవారు. లెక్కల చిక్కులను సులువుగా పరిష్కరించేవారు. లాజికల్ థింకింగ్ ని బాగా పెంచేవారు. బహుశా నేను ఈరోజు రెండు తెలుగు రాష్ట్రాలలో ఒక లెజెండరీ సైకాలజీ ఫ్యాకల్టీగా ఒక మంచి గుర్తింపు తెచ్చుకోవడంలో వారు నేర్పిన తాత్విక విచక్షనే కారణం అని నా నమ్మకం .అందుకే వారిని నేను ఎప్పటికీ మరచిపోలేను.

ఇక సంస్కృతంలో ఓనమాలు నేర్పింది శ్రీ  శ్రీనివాసన్ మాస్టారు. వారు పాఠ్యాంశాలను పాఠ్యపుస్తకం చూడకుండా అనర్గళంగా చెప్పేవారు. వారి జ్ఞాపకశక్తి నన్ను చాలా ఆశ్చర్యానికి గురి చేసేది . శబ్దములు, ధాతువులు ఈరోజుకు కూడా అనగా 36 సంవత్సరముల తర్వాత కూడా నేను తప్పు లేకుండా చెప్పగలుగుతాను, కారణం ఆచార్యులు శ్రీనివాసన్ గారే. వారు స్వర్గస్తులైనారు కనుక ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి కలుగుగాక. తరువాత సుధాకర్ సార్ గారు 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు తన శ్రావ్యమైన కంఠంతో కాళిదాసు రచించిన మేఘసందేశం ,రఘువంశం లాంటి కావ్యాలను చెబుతుంటే నిజంగానే కాళిదాసు వర్ణన కళ్ళకు కట్టినట్లు కనిపించేది. రియల్లీ హాట్సాఫ్ టు హిం.

ప్రధానోపాధ్యాయులు శ్రీ గురవయ్య మాస్టారు గారి పట్ల అందరికీ చాలా భయం ఉండేది .చివరకు ఉపాధ్యాయులకు కూడా. తప్పు చేయాలంటే విద్యార్థులకు ఎంత భయమో, ఉపాధ్యాయులకు కూడా అంతే భయంగా ఉండేది. పాఠశాలలో జరిగే ప్రతి చర్యను ఒక సీసీ కెమెరాలా వాచ్ చేసేవారు. అందుకే పాఠశాలలో విద్యార్థులు ,విద్యార్థుల మధ్య ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు ఉండేవి. నిజమైన నాయకుడు ఎప్పుడు సమూహాన్ని తాను ముందుండి నడుపుతాడు అనటానికి నిలువెత్తు నిదర్శనం మన గురవయ్య మాస్టారు .వారితో మా సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. వారిది ప్రజాస్వామ్య నాయకత్వం అని చెప్పవచ్చు.

ఇంకా చివరిగా ముగింపునిస్తున్నాను. ఈ దేవాలయములో చదువుతోపాటు ఆనందం, విజ్ఞానం, క్రమశిక్షణ, శారీరక శిక్షణ, ఆటలు, పాటలు, విహారయాత్రలు ఇలా ఎన్నో ఆనందాలను మా మదిలో ఇముడ్చుకున్నాం. మా హృదిలో నిలుపుకున్నాం. ఈరోజు రెండు రాష్ట్రాలలో టాప్ సైకాలజీ లెక్చరర్ గా, అనేక పుస్తకాల రచయితగా ( yes & yes publications) ఒక గవర్నమెంట్ టీచర్ గా రాణించటానికి తోడ్పడిన నా దేవాలయం- *శ్రీ వేణుగోపాలస్వామి ఉన్నత పాఠశాల అయితే నా దేవుళ్ళు అందులో పాఠాలు చెప్పిన నా గురువులందరు వీరందరికీ నమస్కరిస్తూ

మీ సింగమనేని నాగేశ్వరరావు,
1988 ssc batch,
Psychology lecturer,
Yes&Yes publications.